క్లుప్తంగా

క్రీడా పోటీల్లో దుర్గా పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



దాచేపల్లి: నడికుడి దుర్గా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ శర్మ గురువారం తెలిపారు. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లిలో జరిగిన క్రీడా పోటీల్లో బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, బాస్కెట్ బాల్‌లో ప్రథమస్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో బాలుర విభాగంలో రెండో స్థానం సాధించినట్లు తెలిపారు. విజేతలను సాగర్ సిమెంట్ యాజమాన్యం ప్రతినిధులు అభినందించారు.

రేపు ముగ్గుల పోటీలు

మాచర్ల రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 11 శనివారం వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ క్లబ్ ఆధ్వర్యంలో మెగా ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నట్లు వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ క్లబ్ అధ్యక్షుడు భవనాసి రవితేజ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వాసవి క్లబ్ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలు స్థానిక 13వ వార్డులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, సెక్రటరీ బత్తుల వీర బ్రహ్మం, మాజీ రీజియన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, కోశాధికారి బచ్చు రాజ్ కుమార్ తదితరులున్నారు.

12న సినిమా పాటల పోటీలు



మాచర్ల రూరల్: తెలుగు వారి సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 12న లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 'మనమూ పాడుదాం' పేరుతో సినిమా పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ డాక్టర్ ముటుకుల కమలాసన్‌రావు తెలిపారు. తెలుగు వారి సంప్రదాయాలను మరువకుండా 22 సంవత్సరాలుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 12వ తేదీ ఆదివారం మానుకొండ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు అభ్యర్థులు ఉదయం 10 గంటలకు జరిగే సెలక్షన్‌కు హాజరు కావాలని, ఎటువంటి ఎంట్రీ ఫీజు, వయో భేదం, లేదన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 10 ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 9441065681ను సంప్రదించాలన్నారు.

మాచర్ల తహసీల్దార్‌గా కిరణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



మాచర్ల రూరల్: మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం బి.కిరణ్ కుమార్ నూతన తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ సక్రమంగా అందేలా కృషి చేస్తానన్నారు. సిబ్బంది చొరవతో ప్రభుత్వ పనులను సకాలంలో పూర్తయ్యేలా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి పనిచేస్తానన్నారు. మండలంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా నేరుగా తనను కలవవచ్చునన్నారు. జిల్లా కలెక్టర్ ఆఫీసులో ఏటగా పనిచేస్తూ బదిలీపై మాచర్లకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన బత్తుల వాణి, డీటీ వెంకటరమణ, పల్నాడు జిల్లా వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు ఆరుమళ్ళ నాగేశ్వరరావు, టైపిస్టు శ్రీవల్లి, సీనియర్ అసిస్టెంట్ రంగారావు, ఆర్ఐ ఇంటూరి అనిల్ కుమార్, వీఆర్‌ఓలు ప్రశాంతి, భాస్కర్, మహమ్మద్ హుస్సేన్, అనిల్, జలీల్, రవికుమార్, గంగమ్మ, శ్రీను తదితరులు తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

సీసీ రోడ్డు ఏర్పాటు

గురజాల రూరల్ : మండల పరిధిలోని పల్లెగుంత గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం గురువారం చేపట్టారు. ఈ రోడ్డును టీడీపీ నాయకుడు జాస్తీ ప్రకాష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులున్నారు.

గంగవరం సచివాలయం పరిశీలన



గురజాల రూరల్ : మండల పరిధిలోని గంగవరం గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో గౌసియా బేగం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను నిష్పక్షపాతంగా చేయాలని వంద శాతం పూర్తి చేయాలని వార్డు సెక్రటరీలకు సూచనలు అందించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

మాచర్ల రూరల్: పూర్వీకుల ఆచారాలు, పద్ధతులు, పండుగలు, నేటి సైన్స్‌కు దగ్గరగా ఉన్నాయని, ఎన్నో పరిశోధనలు నిరూపించాయి. అలాంటి పండుగల విశిష్టతను తెలిపేందుకు ముందస్తు సంక్రాంతి వేడుకలు శుభపరిణామమని ఓక్ బ్రిడ్జ్ స్కూల్ చైర్మన్ కొమ్మారెడ్డి చలమారెడ్డి అన్నారు. గురువారం పట్టణం, మండలంలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఓక్ బ్రిడ్జ్ స్కూల్‌లో చిన్నారుల ముగ్గులు, హరిదాసు వంటి వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. కొప్పునూరు జెడ్పీహెచ్ స్కూల్‌లో హెచ్‌ఎం నాగమణి నేతృత్వంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని నారాయణ, కృష్ణవేణి, శ్రీచైతన్య, జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కోలాహలంగా సంక్రాంతి సంబరాలు

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల, శ్రీరామకృష్ణ గురుకుల పాఠశాల, ఫాతిమా విద్యానికేతన్‌లో సంక్రాంతి వేడుకలను గురువారం కోలాహలంగా నిర్వహించారు. రంగవల్లుల పోటీలు, భోగి మంటలు, హరిదాసు వేషధారణ, గాలి పటాలు ఎగుర వేయడం వంటివి ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ రె.ఫాదర్ పీటర్ పాపయ్య విద్యార్థులకు గాలిపటాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫాదర్ రె.పీటర్ పాపయ్య, ఫాతిమా స్కూల్ డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి, శ్రీరామకృష్ణ గురుకుల పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ రంగంలో ఉన్నా మన మూలాలు మరువకూడదని, మన పూర్వీకుల నుంచి ఆచరిస్తున్న ఇటువంటి పండుగలు నిర్వహించడం వలన మన సంస్కృతి సంప్రదాయాలు భావి తరాలకు తెలుస్తాయన్నారు. కార్యక్రమాలలో ఫాతిమా స్కూల్ హెచ్‌ఎం ఏరువ స్టెఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓక్ బ్రిడ్జ్ స్కూల్‌లో వేసిన భోగి మంటలు



సంక్రాంతి సంబరాలలో పొంగళ్లు వండుతున్న టీచర్లు



తిరగలిని తిప్పుతున్న చిన్నారులతో చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

దాచేపల్లిలో సంక్రాంతి సంబరాలు

దాచేపల్లి: సంక్రాంతి సంబరాలు గురువారం వైభవంగా నిర్వహించారు. దాచేపల్లి నగర పంచాయతీతోపాటు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు ప్రత్యేక వేషధారణలతో అలరించాయి. స్థానిక స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగవల్లులు సంస్కృతికి ప్రతీక

గురజాల : రంగవల్లులు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని సిస్టర్ అరుణ్ రోజ్ అన్నారు. స్థానిక గుడ్ న్యూస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ మాట్లాడుతూ పండుగల ప్రాముఖ్యత ప్రస్తుతం చిన్నారులకు తెలియజేయాల్సిన ఆవశ్యకత పెద్దలపై ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులు వేసిన రంగవల్లులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శరత్ మేరి, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.



స్కాలర్స్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



గుడ్ న్యూస్ స్కూల్‌లో ముగ్గుల పోటీలో చిన్నారులు

తిరుమల ఆక్స్‌ఫర్డ్‌లో సంక్రాంతి సంబరాలు

పిడుగురాళ్లరూరల్: సంక్రాంతి అంటేనే సంప్రదాయానికి నిలువటద్దం. అలాంటి సంప్రదాయంతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తే వారు జీవితంలో తెలుగింటి సంప్రదాయాలను మరిచిపోరని నిరూపించే విధంగా తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సంబరాలకు తిరుమల ఆక్స్‌ఫర్డ్ చైర్మన్, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరై భోగి మంటలు, ముగ్గులను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయాలను గౌరవించి ముందు తరాల వారికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందులో భాగంగానే తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు సంప్రదాయలను తెలియజేసేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించామని తెలిపారు.



ఫాతిమా విద్యానికేతన్‌లో విద్యార్థినులువేసిన రంగవల్లులు



కొప్పునూరు జెడ్పీహెచ్ స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



చిన్నారులకు భోగి పండ్లను వేస్తున్న ఉపాధ్యాయురాలు

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



పిడుగురాళ్ల: ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి డి.శివకుమారి అన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో ఎం.శ్వేత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, క్యాజువల్ లీవులు, పండగ సెలవులు, మెడికల్ లీవులను అమలు చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివసారావు, ఆశ వర్కర్లు శ్వేత, కోమలత, కోటేశ్వరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించండి



వెల్దుర్తి: విద్యార్థులకు ఆధ్యాత్మిక, నైతిక విలువలు పెంపొందించాలని శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మండాది జిల్లా ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్వామి వివేకానంద విద్యార్థులకు సాహిత్యాన్ని అందించి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగరాజకుమారి మాట్లాడుతూ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాల నుంచి మాచర్ల పరిసర గ్రామాలలోని స్కూళ్ళలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణ, కృష్ణమూర్తి, ఆంజనేయులు, సభ్యులు ఇరువంటి శ్రీనివాసరావు, చంద్రారావు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ముస్తాబవుతున్న దేవాలయాలు

మాచర్ల రూరల్: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని పట్టణంలోని ప్రముఖ చరిత్రాత్మకమైన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో భక్తుల దర్శనం కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉదయం 4 గంటల నుంచి 9.53 వరకు ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు గడియలు ఉండటంతో భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారి దర్శనానికి రానున్న నేపథ్యంలో బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాట్లను చేశారు. వీటితో పాటు బస్టాండ్, వడ్డెరపాలెంలోని వేంకటేశ్వరస్వామి, వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారు, కోదండ రామాలయంలలో ఉత్తర ద్వార దర్శనం కోసం ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులకు తాగునీరు, తీర్థ ప్రసాదం, అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈఓ సాంబయ్య తెలిపారు. అర్చకులు అడిగొప్పల సీతారామాచార్యులు ముక్కోటి ఏకాదశినే వైకుంఠ ఏకాదశి అని కూడా అంటారన్నారు.



స్వామి వార్లకు ధనుర్మాస ప్రత్యేక పూజలు



వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి వారు



విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్న భక్తులు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలోని పలు దేవస్థానాలలో ధనుర్మాసం సందర్భంగా గురువారం స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు, రెంటాల గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు పూరిమెట్ల శేషభట్టాచార్యులు, తుమ్మకోట గ్రామంలోని జనార్ధనస్వామి ఆలయంలో వెంకట రమణమూర్తి, సతీష్ నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నగర సంకీర్తన, గోదాదేవి పాసురాలు, గీతా పరాయణం నిర్వహించారు. స్వామివార్లను పలు రకాల పూలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. దేవస్థానం చైర్మన్లు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హుండీ కానుకలు లెక్కింపు

దుర్గి: అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ.17,37,135ల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సైదమ్మ బాయి తెలిపారు. సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, కారంపూడి గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి కృష్ణంరాజు ఆధ్వర్యంలో 50 రోజుల పాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలకు అర్జీల స్వీకరణ

మాచర్ల రూరల్: నివేశన స్థలాలు లేని నిరుపేదల నుంచి నివేశన స్థలాల మంజూరుకు అర్జీలను సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్వీకరించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నివేశన స్థలాలు లేక ఎన్నో ఏళ్ళగా పేదలు అద్దె ఇళ్ళలో ఉండి అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టేందుకు నగదును అందించాలన్నారు. బాబురావు మాట్లాడుతూ అర్జీదారులు ముందుగా రైల్వే స్టేషన్ రోడ్డులోని సీపీఐ కార్యాలయానికి హాజరుకావాలన్నారు. అర్జీలతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్ళి దాఖలు చేసుకోవటం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.



యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా అయేషా



మాచర్ల రూరల్: యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా షేక్ అయేషా సుల్తానా ఎంపికయ్యారు. కాకినాడలో మూడు రోజుల పాటు నిర్వహించిన యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలో ఎంపిక జరిగినట్లు మండల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు నాసర్‌రెడ్డి, రామారావులు తెలిపారు. పట్టణంలోని జెడ్పీహెచ్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అయేషా సుల్తానా ఉపాధ్యాయుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి వాటి పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గురువారం డిపో మేనేజర్ బి.కోటేశ్వర నాయక్ తెలిపారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో 9959225430 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రామాలయంలో సహస్ర దీపాలంకరణ సేవ

మాచర్ల రూరల్: పట్టణంలోని కోదండరామాలయంలో ధనుర్మాసం సందర్భంగా గత నెల 16వ తేదీ నుంచి ఈ నెల 13వ తేదీ వరకు అర్చకులు కొండవీటి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి ఆలయంలో దేవేరులకు ఊంజల్ సేవ, భక్తులు సహస్ర దీపాలంకరణ చేశారు. ఈ కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. పలువురు మహిళా భక్తులు కోలాటం, నృత్యాలతో అలరించారు. శుక్రవారం ముక్కోటి సందర్భంగా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు మారం ప్రసాదరావు, పోలిశెట్టి పిచ్చయ్య, విడేల సుందరరావు, అధ్యక్షులు బచ్చు రామారావు, ఉపాధ్యక్షులు మారం శ్రీనివాసరావు, చీదెళ్ళ ఆంజనేయులు, వూటుకూరి పాలయ్య, పోలిశెట్టి కష్ణమూర్తి, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, పోలూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కొత్తూరి వెంకట బాల కోటేశ్వరరావు, కోశాధికారి మేడం నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు గొల్ల వెంకటేశ్వర్లు, విడేల సీతాలక్ష్మీనారాయణ, కంభంపాటి వెంకటరమణ (చంటి), గజవలి రత్నం, బత్తుల వీర బ్రహ్మం, గుండా శ్రీనివాసరావు, పందిరి నరసింహారావు, కర్నాటి అప్పారావు తదితరులున్నారు.

యూటీఎఫ్ మహాసభల్లో మాచర్ల నేతలు

మాచర్ల రూరల్: కాకినాడలో మూడు రోజుల పాటు జరిగిన యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలో మాచర్ల నియోజకవర్గం నుంచి యూటీఎఫ్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్ళారు. గురువారం ముగింపు ఉత్సవాలలో రాష్ట్ర ఎమ్మెల్సీలు లక్ష్మణ్‌రావు, పుణ్యమూర్తి, ఐ.వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీఆర్ ప్రసాద్‌లు స్వర్ణోత్సవ మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ సభ్యులకు వారు అభినందనలు తెలిపారు.



ముమ్మరంగా
రబీ సాగు

ఖరీఫ్ సాగు ముగియటంతో రబీ సాగు రైతులు ముమ్మరం చేశారు. సాగర్ కాలువ ద్వారా నీటి సౌకర్యం అందే మాగాణి పొలం, బోర్ల ద్వారా నీటి సౌకర్యం ఉన్న పంట పొలాల్లో వరి సాగును రైతులు చేపట్టారు. ఇప్పటికే నారుమళ్లను ఏపుగా పెంచారు. పెంచిన వరి నారుమళ్లలో వరి నారును తొలగించి దమ్ము చేసిన మాగాణి పొలాల్లో వరి నాట్లను నాటుతున్నారు. పిడుగురాళ్ల పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో రబీ వరి సాగు ముమ్మరంగా కొనసాగుతుంది. వరి నారు పెంచని రైతులు నారు పెంచిన రైతుల వద్ద వరి నారు కట్టలను కొనుగోలు చేసుకొని ఆటోలలో వారి మాగాణి పొలాల వద్దకు తరలిస్తున్నారు. రబీలో వరి నారుకు రోజు రోజుకు డిమాండ్ పెరుగుతుంది.

– పిడుగురాళ్ల



వరి నారుమడిలో నారు పీకుతున్న మహిళలు



మాగాణి పొలంలో వరి నాట్లు వేస్తున్న మహిళలు



ఆటోలో తరలిస్తున్న వరి నారు

అఖిల భారతీయ యాదవ మహాసభ అధ్యక్షుడిగా నరసింహారావు



గురజాల : అఖిల భారతీయ యాదవ మహాసభ గురజాల నియోజకవర్గ అధ్యక్షుడిగా యలగాల నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ అన్నారు. గాంధీ తన కార్యాలయంలో గురువారం యలగాల నరసింహారావుకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ యాదవుల సమస్యల పరిష్కారం కొరకు కృషి చేయాలన్నారు. యాదవుల హక్కులు, అభ్యున్నతి కొరకు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు తదితరతులున్నారు.